నేషనల్ 'డాక్టర్స్ డే' Happy Doctors Day శుభాకాంక్షలు... Special Feature

ఆక్రమణలపై దృష్టి సారించాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధిలో చాలాచోట్ల ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్న నేపథ్యంలో వాటి రక్షణపై ప్రత్యేక దృష్టిసారించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధికారులు, సర్వేయర్లకు సూచించారు. చైర్‌పర్సన్ అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఇంజినీరింగ్ విభాగం, మంచినీటి సమస్య పరిష్కారం, రోడ్ల నిర్మాణం, స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వాహణ, మొక్కలు నాటివేత, మున్సిపల్ సిబ్బంది వేతనాల చెల్లింపు తదితర 11 అంశాలతో కూడిన ఎజెండాపై కౌన్సిల్ సభ్యులు చర్చించారు. సభ్యులు పలు సూచనలు చేసి ఎజెండాను ఆమోదించారు. పట్టణంలో కుక్కలు, కోతులు, రోడ్లపై పశువుల సంచారం లేకుండా చూడాలని, పట్టణంలో చాలా చోట్ల రోడ్లకు ఆనుకొని, రోడ్ల మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాల వల్ల ప్రమాదాలు జరుగకుండా చూడాలని, కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను వెంటనే తొలగించాలని, చెరువులను బాగు చేయించాలని, వీధి దీపాలు ఏర్పాటు సభ్యులు అధికారులను కోరారు. మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, వైస్‌చైర్‌పర్సన్లు ఉలాల భారతి దివ్య, లాబాల స్వర్ణమణి పాల్గొన్నారు.

రోడ్లపై సంచరిస్తున్న ఆవులు గోశాలకు తరలింపు

టెక్కలి రూరల్: టెక్కలి పట్టణంలోని రోడ్లపై కొద్దిరోజులుగా ఆవులు విచ్చలవిడిగా తిరుతున్నాయి. పగలంతా రోడ్లపై తిరుగుతూ చెత్త పేపర్లు, ఇతర పదార్థాలను తింటున్న ఆవులు రాత్రి సమయంలో రోడ్డు మధ్యలో పడుకుని ఉంటున్నాయి. దీంతో వాహన చోదకులు వీటిని గమనించకుండా వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ క్రమంలో చాలామంది గాయపడిన సందర్భాలు ఉన్నాయి. దీంతో ప్రజలు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎట్టకేలకు స్పందించిన పంచాయతీ సిబ్బంది రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్న ఆవులను బంధించి వ్యాన్‌లో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సమీపంలో ఉన్న గోశాలకు తరలిస్తున్నారు.

నాణ్యమైన కొబ్బరి మొక్కలు అందజేయాలి

సోంపేట: కొబ్బరి రైతులకు నాణ్యమైన మొక్కలు అందజేయాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు ఉద్యానశాఖ సిబ్బందికి సూచించారు. ఉద్యాన శాఖాధికారులతో కలిసి బారువలోని కొబ్బరి నర్సరీని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యానశాఖాధికారులతో మాట్లాడారు. రైతులకు అవసరమైన కొబ్బరి, జీడి మొక్కలను సకాలంలో అందజేయాలని కోరారు. ఉద్యానశాఖాధికారి మాధవిలత, సర్పంచ్ యర్ర రజనీ ఉన్నారు.

పాఠశాలలను సందర్శించిన డీఈవో

ఇచ్ఛాపురం/ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం పట్టణంలోని కేజీబీవీని డీఈవో తిరుమల చైతన్య సోమవారం సాయంత్రం సందర్శించారు. వసతి గృహంలో ఉంటున్న విద్యార్థినులతో మాట్లాడారు. ఇంటర్మీడియెట్ విద్యాబోధన గురించి అడిగి తెలుసుకొన్నారు. అనంతరం మండలంలోని కొఠారీ, డొంకూరు మోడల్ ప్రైమరీ పాఠశాలలను డీఈవో తనిఖీ చేశారు. పిల్లలను సర్కార్ బడుల్లో చేర్పించాలని కోరారు. ఎంఈవోలు కె.అప్పారావు, ఎస్.విశ్వనాథం ఉన్నారు.

నాయకుల పరామర్శ

కాశీబుగ్గ: పలాసకు చెందిన పెంట జయలక్ష్మి మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యులను మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు సోమవారం పరామర్శించారు. నాయకులు పి.వి.సతీష్, బోర భగవతి, తూముల శ్రీనివాసరావు, బమ్మిడి దుర్యోధనరావు, బమ్మిడి సంతోష్ కుమార్, నర్తు రమణ ఉన్నారు.

కంచిలి: బొనమాళి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఉమ్మడి అప్పన్న అనారోగ్యంతో మృతిచెందాడు. వారి కుటుంబాన్ని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి పరామర్శించారు. సర్పంచ్ గణప సింహాచలం ఉన్నారు.